
ప్రజాశక్తి
ఆదివారం 16 నవంబర్ 2025 5 విజయనగరం



పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లాలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లోని ప్రజలు వణికిపోతున్నారు. గిరిజన గ్రామాలైన దారపర్తి, మూల బొడ్డవర, రేగపుణ్యగిరి, మారిక, డి.కె.పర్తిలో గిరిజనులు చలి తీవ్రతకు గజగజలాడుతున్నారు. రాత్రివేళల్లో 15 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తీవ్రమైన చలితో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గౌరీష్ కోరారు.



దారపర్తిలో చలిమంట కాస్తున్న గిరిజనులు



జిల్లాలో అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇందుకు సంబంధించి పురపాలక శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. 120 రోజుల వ్యవధిలో దరఖాస్తుల గడువు నిర్దేశిస్తూ పురపాలక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనివలన నగర పాలక సంస్థ కు సుమారుగా రూ.6 నుంచి 8 కోట్లు వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. నగరంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు, నిర్మించిన భవనాల్లో టౌన్ ప్లానింగ్ శాఖ ఇచ్చిన ప్లాన్ కి విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ కింద ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటికి కొలతలు ఆధారంగా ప్లానింగ్ సిబ్బంది అపరాధ రుసుము విధించనున్నారు. ఆ మొత్తాన్ని చెల్లిస్తే ఆ భవనాలను రెగ్యులర్ చేస్తారు.

దరఖాస్తు చేసుకునే విధానం

బిపిఎస్‌కు గుర్తింపు పొందిన టెక్నికల్ పర్సన్ల ద్వారానే దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలి. ప్రాథమిక రుసుము రూ. 10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. యాజమాన్య ధ్రువీకరణ పత్రం (ఇసి), గతంలో మంజూరు చేసిన ప్లాన్ (అందుబాటులో ఉంటే), ప్రస్తుత తేదీలతో స్టాంప్ ఫొటోలు, నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మించిన అక్రమ కట్టడాల ప్రాంతాన్ని గుర్తిస్తూ డ్రాయింగ్, రోడ్ల విస్తరణకు సమర్పించాల్సిన ఇండెమిటీ బాండ్, కట్టడ స్థిరత్వ సర్టిఫికెట్, అగ్నిమాపక, ఎయిర్‌పోర్టు అథారిటీ, ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల నిరభ్యంతర పత్రాలు జత చేయాల్సి ఉంటుంది.

నిర్మాణదారులకు సదావకాశం

● ఆగస్టు 31లోపు నిర్మాణాలకు బిపిఎస్ ● నగరపాలక సంస్థకు రూ.8 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతంలో ఈ విధంగా బిపిఎస్ ద్వారా విజయనగరం నగర పాలక సంస్థ కు సుమారుగా రూ.11 కోట్లు వరకు ఆదాయం వచ్చింది. తాజాగా బిపిఎస్ అవకాశం కల్పించడం వల్ల నగరంలో సుమారు 300 నుంచి 500 ఎసెస్‌మెంట్లు బిపిఎస్ కిందకు వచ్చే అవకాశం ఉన్నట్లు నగరపాలక సంస్థ ప్లానింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివలన నగర పాలక సంస్థ కు సుమారుగా రూ.6 నుంచి రూ.8 కోట్లు వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. వీటిలో ఎక్కువగా 200 గజాలు దాటి ఇల్లులు కట్టుకున్నవారు బిపిఎస్‌కు మొగ్గు చూపుతారు. 200 గజాలు లోపు నివాసాలు వారు అంత ఆశక్తి చూపే అవకాశం తక్కువ. అలా 100 నుంచి 200 గజాలు లోపు ఉన్న వారు కూడా బిపిఎస్ కు దరఖాస్తు చేసుకుంటే ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. దాని కోసం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. పూర్తి స్థాయిలో సర్వే చేస్తే బిపిఎస్ కిందకు వచ్చే గృహాల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశాలు కూడా ఉన్నాయి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా మరింత ఆదాయం పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

ఆగస్టు 31 తేదీలోపు నిర్మాణాలకు వర్తింపు

బిపిఎస్-2025లో భాగంగా 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ లోపు నిర్మించిన అక్రమ కట్టడాలకు బిపిఎస్ వర్తించనుంది. ప్లాటు సైజు, ఉల్లంఘనలకు అనుగుణంగా చదరపు అడుగు 40 నుంచి 400 రూపాయల వరకు పీనలైజేషన్ ఛార్జీలు చెల్లించాలి. అపార్టుమెంట్లు, ఫ్లాట్ల విషయంలో అక్రమ కట్టడాలకు రూ.20 వేల నుంచి 80 వేల వరకు (ఒక్కో ప్లాటు), అక్రమ ఫ్లోర్లకు అయితే చదరపు అడుగు రూ.120 నుంచి రూ.200 వరకు చెల్లించాలి. 1997 డిసెంబర్ 31 నాటికి ముందు నిర్మించిన భవనాలకు 25 శాతం, నోటిఫైడ్ స్లమ్స్ (మురికివాడలు)ల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటికి ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుంది. మిగిలిన పీనలైజేషన్, బిల్డింగ్ పర్మిట్ ఫీజు, అభివృద్ధి ఛార్జీలు, బెటర్మెంట్ ఛార్జీలు, ఇంపాక్ట్ ఫీజు, అదనపు ఫీజులు వర్తించవు. ప్రభుత్వ ఆక్రమణలు, న్యాయపరమైన వివాదాలు, యుఎల్‌పి- మిగులు, ట్యాంక్ బెడ్స్, డ్రైన్లు, పర్యావరణ ఆంక్షలు ఉన్న ప్రాంతాలకు బిపిఎస్ అమలు చేయరు. లేఔట్ల బహిరంగ స్థలాలు, రిక్రియేషన్ జోన్లు, పార్కింగు నిర్దేశించిన స్థలాల విషయంలో మినహాయింపు ఉంటుంది. 2025 ఆగస్టు 31కి ముందు చేసిన నిర్మాణాలను క్రమబద్ధీకరించడానికి ఇదో అవకాశం. బిపిఎస్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేసిన వారు, అక్రమ కట్టడాలు, నిర్మాణంలో ప్లాన్ ప్రకారం కాకుండా అదనంగా డీవియేషన్ నిర్మాణాలు చేపట్టిన వారు బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఈ దఫా బిపిఎస్ చేసుకోపోతే తర్వాత వాటిని రెగ్యులర్ చేసుకునే అవకాశం ఉండదు. కావున నగర ప్రజలు వినియోగించుకోవాలి.

- పి.నల్లనయ్య,
నగరపాలక సంస్థ కమిషనర్

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని

వచ్చే వారానికి పురోగతి కనపడాలి ● టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం, నవంబర్ 15: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు డైలీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పన కూడా శత శాతం జరగాలన్నారు. శనివారం ఉపాధి పనులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ డ్వామా పీడీ, ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలతో మండలవారీగా కనీస వేతనాలు, పనిదినాలు, తదితర పనుల పై సమీక్షించారు. పని దినాల కల్పనలో వెనుకబడితే మండలాధికారులు పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో కనీసం వెయ్యి మంది ఉపాధి శ్రామికులకు పని కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సరాసరి వేతనం రూ.300గా నిర్దేశించినప్పటికీ, అన్ని మండలాల్లో 300 అందడం లేదని, వచ్చే వారానికి ప్రతి మండలంలో 300 పై బడి అందేలా చూడాలని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున, ఎక్కువ మంది శ్రామికులు పనులకు హాజరయ్యేలా చేసి సరాసరి వేతనం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరైన ఫారం పాండ్స్, కంపోస్ట్ పిట్స్, రింగ్ ట్రెంచెస్, ఫిష్ పాండ్స్ వంటి 4 రకాల పనులకు శ్రామికులను అవగాహన పరిచి, ఎక్కువ మందిని హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంజూరైన పశువుల శాలలు అన్నింటిని గ్రౌండ్ చేయాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగించాలి

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశుభ్రతపై విద్యార్థులే వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత-సామాజిక పరిశుభ్రత పై శనివారం బాబామెట్టలో బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, టాయిలెట్ కి వెళ్ళిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి, తినే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, ఎంఇఒ సత్యవతి పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

డ్వాక్రా మహిళల నిధులు కాజేత

ప్రజాశక్తి-బాడంగి



బాధిత మహిళలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బాడంగిలోని దళిత కాలనీకి చెందిన క్రాంతి మహిళా సంఘం నిధులను ఎస్‌బిఐ బిఎల్ పాయింట్ నడుపుతున్న వ్యక్తి కాజేసి, వారిని మోసం చేశాడని బాధిత మహిళలు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకర రావు, ఎస్.గోపాల్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం బాడంగిలో బాధిత మహిళలను సిఐటియు నాయకులు కలిసి, సమస్య తెలుసుకున్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలో ఇంకా రూ.3 లక్షలు బకాయి ఉందని మేనేజర్ చెప్పడంతో కంగుతిన్నామని బాధిత మహిళలు తెలిపారు. మూడేళ్ల క్రితం ఎస్‌బిఐ ఏర్పాటు చేసిన బిఎల్ పాయింట్ నడుపుతున్న కోడూరుకు చెందిన శ్రీను ఈ మోసానికి పాల్పడ్డాడని చెప్పారు. తాము బిఎల్ పాయింట్ వద్ద డబ్బులు కట్టేశామని చెప్పినప్పటికీ బ్యాంకు మేనేజరు తమకు సంబంధం లేదని అన్నారని బాధితులు తెలిపారు. క్రాంతి పొదుపు సంఘాన్ని శ్రీను మోసం చేశాడని తెలిసినా వెలుగు సిసి సత్యనారాయణ పట్టించుకోలేదని సిఐటియు అన్నారు. శ్రీను దగ్గర వసూలు చేసి మీ డబ్బులు వచ్చే విధంగా చేస్తామని బ్యాంకు మేనేజర్ కిరణ్ హామీ ఇచ్చి, దళిత మహిళలను దగా చేశారన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, మేనేజర్‌పై, బిఎల్ పాయింట్ శ్రీనుపై, వెలుగు సిసి సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే రూ.3 లక్షలను శ్రీను వద్ద రికవరీ చేయాలని డిమాండ్‌చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లా సత్తా

ప్రజాశక్తి - నెల్లిమర్ల



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో విజేతలు

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించారు. కొండవెలగాడ జడ్‌పి హైస్కూల్ ఆవరణలో గత రెండు రోజులుగా జరుగుతున్న 12వ బాల, బాలికలు, స్త్రీ, పురుష రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శనివారం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించారు. వీరిలో ఆర్.భవాని 48కిలోల విభాగంలో (జూనియర్ మహిళ) 148కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, సీనియర్ 48కిలోల విభాగంలో బి.రాజేశ్వరి 153 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ ఫీమేల్ 44కిలోలు విభాగంలో ఎం.పావని 112 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ ఫీమేల్ 48కిలోలు విభాగంలో ఆర్. భవాని 148 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, జూనియర్ ఫీమేల్ 53కిలోలు విభాగంలో బి.భార్గవి 173కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, జూనియర్ ఫీమేల్ 58కిలోల విభాగంలో వి.సుస్మిత 196కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, సీనియర్ ఫిమేల్ 53కిలోలు విభాగంలో బి. భవాని 173కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, 58కిలోల విభాగంలో వి.సుస్మిత 196కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ ఫీమేల్ 53కిలోలు విభాగంలో బి. భార్గవి 173 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ మేల్ 60కిలోల విభాగంలో బి. రాంజీ 198కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ ఫీమేల్ 58కిలోలు విభాగంలో వి. సుస్మిత 196 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం సాధించారు. వీరితో బాటు సీనియర్, జూనియర్ మేల్ 60కిలోల విభాగంలో కర్నూలుకి చెందిన డి.జి. వీరేష్ 224కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం, యూత్ మేల్ 56కిలోల విభాగంలో కడపకు చెందిన ఎ.పృథ్వి 204కిలోలు బరువెత్తి ప్రథమ స్థానం సాధించారు.

కాంట్రాక్టర్ల ఆందోళన విరమణ

ప్రజాశకి-విజయనగరం టౌన్



రాత పూర్వక హామీ ఇచ్చిన నోట్ ను చూపిస్తున్న కాంట్రాక్టర్లు

బకాయి బిల్లులు చెల్లించాలని కోరుతూ 13 రోజులుగా నగరంపాలక సంస్థలో కాంట్రాక్టర్లు చేపట్టిన సమ్మె శనివారంతో విరమించారు. శనివారం నిరసన శిబిరం వద్ద సబ్కా అసోసియేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అర్.సాధూరావు , నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పి.అశోక్ మాట్లాడుతూ బిల్లులు అయిన చెల్లించాలి లేదా ట్రేడ్స్ విధానం అయిన అమలు చేయాలని చేపట్టిన సమ్మెకు కమిషనర్ నుంచి రాత పూర్వక హామీ రావడంతో ఆందోళన విరమిస్తున్నామని తెలిపారు. ట్రేడ్స్ విధానం అమలుకు సిడిఎంకు లేఖ రాసి, స్థానికంగా ఉన్న ఆడిట్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని చెప్పిన డిమాండ్ల సాధనకు సానుకూలంగా పరిష్కారం కోసం కృషి చేయడంతో ఆందోళన విరమిస్తున్నామని తెలిపారు. ట్రేడ్స్ విధానం అమలు కు అంగీకారం తెలపడం తమ ఉద్యమ విజయమని అన్నారు. చేసిన పనుల బిల్లుల చెల్లింపునకు అంగీకారం కుదిరిందన్నారు. పెండింగ్ లో ఉన్న ఇఎండిలు చెల్లిస్తామని చెప్పారన్నారు. గత ప్రభుత్వం హయాంలో గడప గడపకు కార్యక్రమంలో చేసిన పనుల బిల్లులు గురించి కలెక్టర్‌కు తెలియజేసి చెల్లించేందుకు అంగీకరించారని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు రామారావు, శ్రీనివాసరావు ,జిల్లా కాంట్రాక్టర్లు అసోసియేషన్ అధ్యక్షులు అట్టాడ చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

కాంట్రాక్టర్లు శనివారం నుంచి సమ్మె విరమించడంతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి..వైయస్సార్ నగర్ ప్రాంతంలో సిసి కాలువ పనులు, 12వ డివిజన్ లోని పెద్దపల్లి వీధిలో సిసి రహదారి, పల్లి వీధిలో సిసి డ్రైను, 16 వ డివిజన్లో కాలువ మరమ్మతు పనులు వంటివి చేపడుతున్నారు. ఆయా పనుల నాణ్యతను పరిశీలించేందుకు సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ జరుగుతున్న అభివద్ధి పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాల్సిందేనని అన్నారు.

ఇవేం రోడ్లు బాబోయ్

తరచూ కూరుకుపోతున్న లారీలు

ప్రజాశక్తి -బొబ్బిలి



గోతిలో దిగబడిన లారీ టైర్లు

పట్టణంలోని రాజా కళాశాల రోడ్డులో లారీ టైర్లు కూరుకుపోయాయి. రాజా కళాశాల సమీపంలో రోడ్డుకు మధ్యలో పెద్దగొయ్యి ఉండడంతో తరచూ లారీలు దిగబడుతున్నాయి. మండలంలో పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వే పాడైపోవడంతో భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మండలాల మీదుగా దారి మళ్లించారు. దీంతో వాహనాలు రద్దీ పెరగడంతో గోతులతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా లారీ కూరుకుపోయింది. మరోవైపు రోడ్డుకు మధ్యలో లారీ కూరుకుపోవడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఒంటరి మహిళ దారుణహత్య

ప్రజాశక్తి-కొత్తవలస



హత్యకు గురైన మహిళ

ఒంటరి మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన మండలంలోని వియ్యంపేటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

మండలంలోని వియ్యంపేట గ్రామంలో దూది రాము (56) ఒంటరిగా నివశిస్తోంది. ఆమె భర్త ఇదివరకే మరణించాడు. కుమారుడు జీవనోపాధి రీత్యా శృంగవరపుకోటలో నివాసముంటు న్నాడు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆమె ఎంతకీ బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు తలుపులు తీసి చూశారు. ఆ సమయంలో ఆమె రక్తపుమడుగులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొత్తవలస సిఐ షణ్ముఖరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దించారు.

బంగారం కోసమేనా?

రాము మెడలో సుమారు మూడు తులాల వరకు బంగారం ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో అందరితో ఆమె కలుపుగోలుగా ఉండేదని అంటున్నారు. ఒంటరిగా ఉండడం చూసి, బంగారం కోసం ఎవరో కావాలని చేసిన హత్య చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాము కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో విచారణ చేపడతామని సిఐ షణ్ముఖరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పక్కాగా వరకట్న నిషేధ చట్టం అమలు

● జిల్లాలో 71 వరకట్న వేధింపు కేసులకు రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లింపు
● 171 కేసులు వివిధ కోర్టులలో పెండింగ్ : జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - కంటోన్మెంట్



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

జిల్లాలో వరకట్న నిషేధ చట్టం, గృహ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం పక్కాగా అమలు జరగాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వరకట్న నిషేధ చట్టం జిల్లా అడ్వయిజరీ బోర్డు కమిటీ మెంబర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం నేరమని, వరకట్న నిషేధ చట్టంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సమాఖ్య, మెప్మా, స్థానిక ఎస్‌హెచ్‌ఒలతో సమావేశాలు నిర్వహించి వరకట్న నిషేద చట్టంపై అవగాహన కల్పించి విస్తత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలోని వరకట్న నిషేధ చట్టంపై నమోదైన కేసుల వివరాలను పోలీసు అధికారులు, గృహహింస నుండి మహిళలకు రక్షణ చట్టం అధికారులను సభ్యులను ఆరా తీశారు. ఇప్పటివరకు 1051 కేసులలో 880 కేసులను పరిష్కరించగా 171 కేసులు వివిధ కోర్టులలో విచారణ పెండింగులో ఉందన్నారు. 2015 నుండి ఇప్పటివరకు 71 వరకట్న వేధింపు కేసులకు గాను రూ.20 లక్షలు నష్టపరిహారంగా చెల్లించినట్లు తెలిపారు. వరకట్న నిషేధ చట్టంపై కౌన్సిలింగులు నిర్వహించి కేసులు త్వరితగతిన పెండింగు కేసులు పరిష్కారానికి చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా గృహ హింస రక్షణాధికారి, ఐసిడిస్ పీడీ టి.విమలరాణి, పోలీస్ అదికారి టి.శ్రీనివాసరావు, జిల్లా గృహ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం లీగల్ కౌన్సిలర్లు జి.మాధవి, జె.రజని,నేచర్ వాలంటరీ అర్గనైజెషను ఎన్‌జిఒ. తరపున జి.దుర్గ, సి.ఇ.ఒ. దీక్షా మహిళ వెల్ఫేర్ సొసైటి ఎన్.జి.ఒ. ఎల్.సాహితీ, చైతన్య భారతి ఎన్.జి.ఒ తరపున ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

చేతిబోర్ల మంజూరులో

ప్రజాప్రయోజనాలను పట్టించుకోలేదు

డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ




మాట్లాడుతున్న గొంప కృష్ణ

మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో తీసిన చేతిబోర్ల విషయంలో నిబంధనలను పట్టించుకోకుండా, ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టారని డిసిఎంఎస్ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఆరోపించారు. శనివారం వేపాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు పాటించలేదని బోర్లకు అధికారులు బిల్లులు మంజూరు చేయక పోవడంతో ఎంపిపి సత్యవంతుడు తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగా తనపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తప్పుడు మార్గంలో ప్రజాధనాన్ని వృథా చేయాలనుకుంటే దానికి ఎవరూ సహకరించరని, అధికారులు కూడా నిబంధనలు మీరి పనిచేయరని హితవుపలికారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి, వైసిపి నాయకులు వారి స్వలాభం కోసం, అనుకూలంగా ఉన్న వారి కళ్లాల వద్ద బోర్లు తవ్వించుకోవడం దారుణమన్నారు. దీనిపై ఓ సామాజిక కార్యకర్త కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే, అప్పటి కలెక్టర్ అంబేద్కర్ చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇకి ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ఫిర్యాదుదారు సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా అంతా సక్రమమేనంటూ జిల్లా కలెక్టర్‌కి తప్పుడు నివేదిక ఇవ్వడంతో పలుమార్లు పిజిఆర్ఎస్‌లో సామాజిక కార్యకర్త అర్జీలు అందించినట్లు చెప్పారు. డిసిఎంఎస్ చైర్మన్ సమక్షంలో క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని దరఖాస్తులో కోరినా, తన సమక్షంలో సామాజిక కార్యకర్తతో కలిసి పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. గతంలో విశాఖ ఎమ్‌పి శ్రీభరత్ నిధుల నుంచి వేపాడ మండలానికి రూ.1.50 కోట్లు మంజూరు చేస్తే, ఎంపిపి సత్యవంతుడు ఉద్దేశ పూర్వకంగానే కాల పరిమితి ముగిసిన తర్వాత తీర్మానం ఇవ్వడం అభివృద్ధికి వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. ప్రజాధనంతో నిబంధనలకు వ్యతిరేకంగా తీసిన చేతిబోర్లను కలెక్టర్‌తో కలిసి పరిశీలించి, నిధుల దుర్వినియోగంపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమ్మిట్లతో ఒరిగిందెంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమ్మిట్లతో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందెంత? లక్ష్యం ఎంత గొప్పదైనా ఆచరణలో చిత్తశుద్ధి, నిజాయితీ, నిబ్బత ఉంటేనే సంకల్పం నెరవేరుతుంది. లేదంటే ఉత్తుత్తిమాటలగానే మిగిలిపోతాయి. విశాఖ కేంద్రంగా గడిచిన రెండు రోజుల్లో జరిగిన సిఐఐ సదస్సుపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో అచ్చంగా అదే రకమైన పబ్లిక్ టాక్ నడుస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర విభజన తరువాత దాదాపుగా పదేళ్లలో విశాఖపట్నం కేంద్రంగా గతంలో టిడిపి, ఆ తరువాత వైసిపి పలుమార్లు రూ.వేలకోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక ఒప్పందాలు జరిగాయి. కాదు... కాదు ... జరిగినట్టు చెప్పారు. ఇందులో కొన్ని మచ్చుకు పరిశీలిస్తే.... 2016లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖ వేదికగా సిఐఐ సదస్సుల్లో రూ.4.78 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధిం చిన 331 ఎంఒయులపై సంతకాలు జరిగాయి. ఐదు లక్షల ఉద్యోగాలు వస్తాయని అప్పట్లో చెప్పారు. 2018లో రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడులతో 734 ఎంఒయు జరిగాయి. 11 లక్షల మందికి ఉపాధి లక్ష్యమన్నారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం 2023లో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు నిర్వహించి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు, ఆరు లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పింది. వివిధ సందర్భాల్లో ప్రభుత్వాలు చెప్పిన మాటలు ఎలా ఉన్నప్పటికీ ఆచరణలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. కానీ, ఆయా పరిశ్రమల్లో రాష్ట్రంలో ఎక్కడ ఎన్నిపెట్టారో ఆయా ప్రభుత్వాలకే ఎరుక. కానీ, ఉమ్మడి విజయనగరం జిల్లాకు మాత్రం ఒక్కటంటే ఒక్కటి కూడా రాలేదని జనం చర్చించుకుంటున్నారు. కానీ, తామంటే తామే పరిశ్రమలు తీసుకొచ్చామని టిడిపి, వైసిపి నాయకులు చెప్పుకొచ్చారు. ఇదే నిజమైతే గడిచిన పదేళ్లలో పారిశ్రామిక వృద్ధి రేటు పెరగాలి. కానీ, తగ్గుతూ వచ్చింది. అందుకనుగుణంగా పారిశ్రామిక వృద్ధిరేటు తగ్గింది. జిల్లాలో వ్యవసాయ, సేవా రంగాలతో పోలిస్తే పారిశ్రామిక రంగం వృద్ధి చాలా అథమంగానే ఉంటోంది. 2021-22లో రూ.4,940 కోట్ల మేర ఉన్న వార్షిక ఆదాయం 2022-23 నాటికి రూ.7,545 కోట్లకు పెరిగినప్పటికీ 2023-24 నాటికి రూ.6.604 కోట్లకు ఆదాయం తగ్గింది. తాజాగా పెట్టుబడులపై విస్తత ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గతంలో ఏం జరిగిందన్నది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కొత్త పరిశ్రమలు, ఉద్యోగాల సంగతి ఎలా ఉన్నప్పటికీ, ఉన్న పరిశ్రమలు మూతవేతకు ప్రభుత్వ విధానాలే కారణమయ్యాయని జనం చర్చించు కుంటున్నారు.



ముఖ్యంగా గరివిడి ఫేకర్ (ఫెర్రో ఎల్లాయీస్ ఫ్యాక్టరీ) వల్ల ఈ ప్రాంతంలో ఒకప్పుడు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కళకళలాడేది. నేడు ప్రాంతం నేడు వెలవెలబోతోంది. మాంగనీస్ గనులు కేటాయించకపోవడం, విద్యుత్ రాయితీలు తగినంతగా లేకపోవడం వల్ల క్రమంగా ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయివడం ఇందుకు కారణం. చివరికి 2023 నవంబర్‌లో యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. ప్రస్తుతం అక్రమ తొలగింపులు మొదలయ్యాయి. గడిచిన ఏడాదిలోనే సుమారు 300 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గరివిడి, గుర్ల మండలాలకు చెందిన దేవాడ, సదానందపురం మాంగనీస్ గనుల లీజు కాలపరిమితి ఆగస్టులో ముగియడంతో అందులో పనిచేసినవారంతా ఉపాధికి దూరమయ్యారు. ఈ ప్రభావం మరికొన్ని పరిశ్రమల్లో కనిపిస్తోంది. కొత్తవలస మండలంలో జిందాల్ పెర్రో ఎల్లాయీస్ పరిశ్రమను ఈ ఏడాది జూన్‌లో మూతపడంతో 400 మంది కార్మికులకు జీవనోపాధి కోల్పోయారు. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఇంపెక్స్ సహా మరో 4 పెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు మూతపడటంతో 1500 మంది ఉపాధికి గండిపడింది. మెరకముడిదాం మండలం గర్భాంలో ఆంధ్ర పెర్రో ఎల్లాయీస్ పరిశ్రమను 2020లో మూసేయడంతో 600 మంది ఉపాధి పోయింది. గజపతినగరం నియోజకవర్గం మరుపల్లి వద్ద ఓలం జీడి పిక్కల పరిశ్రమ మూతతో 600 మంది పని కోల్పోయారు. జామి మండలం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ మూతకారణంగా 400 మంది, చిన్నాపురం ఎ.ఎస్ జ్యూట్ మిల్లు మూసివేతతో 700 మంది ఉపాధికి దూరమయ్యారు. శృంగవరపుకోట ప్రాంతంలో వివిధ కారణాలతో 10 క్వారీలు మూతపడి 800 మంది ఉపాధికి దెబ్బ తగిలింది. వీటితోపాటు చిన్నాచితకా పరిశ్రమలు జిల్లా అంతా కలిపి 50 వరకు మూతపడ్డాయి. రోడ్లు, భవనాలు వంటి నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో జిల్లా వ్యాప్తంగా చాలా వరకు స్టోన్ క్రషర్స్ ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. మరికొన్ని ఇప్పటికే మూతపడ్డాయి. ఈ ప్రభావం కూడా పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో వెయ్యి కుటుంబాలపై పడింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు జరిగి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ప్రభుత్వరంగంలోగానీ, ప్రైవేటు రంగంలోగానీ ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని మన్యం వాసుల్లో చర్చనడుస్తోంది. ఇటువంటి తరుణంలో ఈనెల 14, 15వ తేదీల్లో మరోసారి విశాఖ కేంద్రంగా జరిగిన సిసిఐ సదస్సులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందెంతో అంటూ జనం చర్చించుకుంటున్నారు.

నిబంధనలకు లోబడి పనిచేస్తాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వేపాడ



ప్రభుత్వ నిబంధనలకు లోబడి, చట్ట ప్రకారమే పని చేస్తామని వేపాడ ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎటువంటి ఆరోపణలున్నా అవి నిబంధనల ప్రకారం చేశారా? లేదా? అన్నది చూస్తామన్నారు. వాటిపై రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. నిబంధనలు మీరి ఉన్న వాటి విషయంలో ఉన్నతాధికారులకు నివేదిక అందించి, తగు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-వేపాడ

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ నిర్వహించారు. ఒక్కొక్క వాలంటీరు పదిమంది చొప్పున వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా వందమంది, వెలుగు ద్వారా 150 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎపిఎం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలకు రైతు సేవ కేంద్రాలలో రైతులు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించాలని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రేగిడి రైతు సేవాకేంద్రంలో టెక్నికల్ సహాయకులు, డేటాఎంట్రీ అపరేటర్స్, ఆర్ఎస్కె సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాలకు వాహనాలకు జిపిఎస్ ట్యాగింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. 17శాతం పైబడి తేమ ఉండేలా ఉండాలన్నారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సేవ కేంద్రాల్లో పనిచేసిన వ్యవసాయ అసిస్టెంట్లు ధాన్యం మిల్లర్లకు ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ధాన్యం ఇచ్చిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకుల నుంచి మైక్రో క్రెడిట్ ప్లాన్ పద్ధతిలో రుణాలు అందజేస్తున్నామని అప్పు పొందిన సంఘ సభ్యులు ఆ డబ్బులతో జీవనోపాధి మెరుగుపరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్డిఎ అదనపు సంచాలకులు డి. రత్నాకర్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో ఉన్న 44 మంది గ్రామ సంఘాల అధ్యక్షులతో మహిళా సంఘ అధ్యక్షులు తాడేల స్వాతి అధ్యక్షతన శనివారం మహిళా సమైక్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ. చిరంజీవి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం నుంచి సభ్యులకు బయోమెట్రిక్ పద్ధతిలో సామాజిక పెట్టుబడి నిధి (సిఐఎఫ్) కింద 9శాతం వడ్డీతో అప్పులు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిఎం రాజశేఖర్, సీసీలు, విఒఎలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక గ్రంథాలయంలో నిరుద్యోగ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను జిల్లాకు చెందిన మేమున్నాం స్వచంద సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ ఈ కార్యక్రమ దాతలైన విజయ్‌కి, శ్రీ వెంకటేశ్వర బుక్ పాయింట్ ప్రతినిధులకు, కార్యక్రమాని హాజరైన గరివిడి బీమా శాఖ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగ విద్యార్థులకు మేమున్నాం సంస్థ అండగా నిలబడటం అభినందనీయమని కొనియాడారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - చీపురుపల్లి

పుస్తకాలను చదవడం ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని చీపురుపల్లి లైబ్రేరియన్ ఎం.ఉషారాణి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చీపురుపల్లి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాల విద్యార్థులతో పాటు పాఠకులు పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-గంట్యాడ

ధాన్యం సేకరణ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. సిఎస్ డిటి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్‌కుమార్, టిఎలు, డిఎఒలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రీన్‌అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించి, ప్రతి నెలా ఐదో తేదిలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఎంపిడిఒ సతీష్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, టి.సన్నిబాబు, దేవా, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణంలోని రెండు రోజుల క్రితం మరణించిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎస్ఐ రమేష్ అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ షాక్‌తో రెండు రోజుల క్రితం మరణించాడు. మృతదేహాన్ని ఎవరూ తీయలేదు. ఈవిషయం ఎస్ఐ రమేష్‌కు తెలియడంతో మృతదేహాన్ని శనివారం శ్మశాన వాటికకు తీసుకుని వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఎస్ఐ రమేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి, సోంపురం గ్రామాల్లో శనివారం మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం పర్యటించారు. ఆయా గ్రామ సచివాలయాలను సందర్శించి, సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి, సర్వీసులను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి - చీపురుపల్లి

వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని చీపురుపల్లి డివిఎల్‌డిఒ హేమ సుందర్ అన్నారు. శనివారం మండలంలోని మెట్టపల్లి పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిపి పారిశుధ్య కార్య నిర్వహణపైన ప్రతిజ్ఞ ర్యాలీ చేశారు. అనంతరం స్కూలు ఆవరణలో ఉపాధ్యాయులు సిబ్బందితో కలిపి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండలంలో రామలింగాపురం పాఠశాలలో తహశీల్దార్ డి.ధర్మరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకించి వ్యక్తిగత పారిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్లె పద్మ, గ్రామ కార్యదర్శి ఈశ్వరరావు, బిజెపి మండల నాయకులు, ఇప్పిలి నీలకంఠం, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని తహశీల్దార్ బి. సుదర్శన్ రావు ర్యాలీని ప్రారంభించి ప్రజలలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సురేశ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సిబి యశ్వంత్ కుమార్, ఎపిఎం కుమార్, ఎపిఒ హరినాథ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపిడిఒ శ్యామలకుమారి అన్నారు. ఉంగరాడ, కెయంవలస గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే అంశం పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామ సభ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగన్నాధరావు, జె ఇ జి.శ్రీచరణ్, ఎంఇఒ ఎరకయ్య, ఎఒ శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ, సర్పంచ్ ప్రతినిధులు చల్లా భుజంగరావు, వియ్యపు చక్రపాణి, ప్రధానోపాధ్యాయులు రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ టి జయరాం అన్నారు. శనివారం మెప్మా ఆధ్వర్యంలో స్వచ్ఛ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగరపంచాయతీ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, నాయకులు కాళ్ల రాజశేఖర్, బంగారు శంకరరావు, మెప్మా సిఎంఎం గేదెల రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: తహశీల్దార్ కార్యాలయం, చినబంటుపల్లి పాఠశాలలో తహశీల్దార్ ఆకుల సులోచన రాణి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

భోజరాపురంలో స్వచ్ఛ ఆంధ్ర

దత్తరాజేరు : మండలంలోని భోజరాజపురంలో ఎంపిడిఒ ఆధ్వర్యాన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఇళ్ల ముందు చెత్త లేకుండా పరిసరాల పరిశుభ్రత తోనే మంచి వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంసిఒ గోవింద్, వ్యవసాయ సహాయకులు రాము, గ్రామ పెద్దలు సూర్యనారాయణ, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆరోగ్య విజయనగరం సాధించాలి : డిఎంహెచ్‌ఒ

కంటోన్మెంట్ : ఆరోగ్య విజయనగరం సాధించే దిశగా అడుగులు వేయాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం, వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక ఆరోగ్యం, హ్యాండ్ వాష్, రుగుదొడ్ల వినియోగంపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠ డాక్టర్ కె.రాణి, డిఐఒ ఆర్.అచ్చుతకుమారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ యన్ సూర్యనారాయణ, పిఒ ఎన్‌సిడి వి.వి.బి. సుబ్రమణ్యం సిబ్బంది పాల్గొన్నారు.


చీపురుపల్లిలో మొక్కను నాటుతున్న డిఎల్‌డిఒ హేమసుందర్

శృంగవరపుకోట : పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సంతోష్ కుమారి అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఇఒ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బొబ్బిలి : పట్టణంలో పాకివీధి మున్సిపల్ హైస్కూల్ వద్ద చేతుల శుభ్రంపై చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డిఇఇ పి.కిరణ్ కుమార్, టిపిఒ జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విజయనగరం కోట : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డిఆర్‌డిఎ కార్యాలయం ఆవరణలో క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. డిఆర్‌డిఎ, ఎస్‌సి కార్పొరేషన్, బిసి కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, ఎపిడి సావిత్రి , రత్నాకర్, డిపిఎంఎస్ రవికుమార్, చిరంజీవి, సీతారామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం రమణమూర్తి

రుణ లక్ష్యాలను చేరుకోవాలి : ఎల్‌డిఎం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతు, పశు, డ్వాక్రా రుణ లక్ష్యాలను పూర్తి చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో బ్యాంకర్లు, వెలుగు, హార్టికల్చర్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా ఇచ్చిన రుణ లక్ష్యాలు పూర్తి చేయడంలో ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని కోరారు. శాఖల వారి ప్రతిపాదనలకు అనుగుణంగా బ్యాంకు సిబ్బంది వెంటనే రుణాలు మంజూరు చెయ్యాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. వెలుగు బ్యాంకు లింకేజీ డిపిఎం లక్ష్మునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1324 సంఘాలకు గాను రూ.64 కోట్లు రుణ లక్ష్యాన్ని అధిగమించామన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల బ్యాంకర్లు, ఎపిఎంలు, సిసిలు, పశుసంవర్ధక, ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

అక్షరాస్యత అందరి బాధ్యత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వయోజనులకు అక్షరాస్యత కల్పించడం అందరి భాధ్యత అని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతం, స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో వయోజనులైన వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. శిక్షణ పొందిన వాలంటీర్లు ఆయా గ్రామాల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంఇఒ యుఎస్ఎన్‌మూర్తి, వయోజన విద్యాశాఖ ప్రతినిధి జయరాం, ఎపిఒ రామారావు, వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కంటోన్మెంట్ : కాలానుగుణంగా బిపి, షుగర్ వంటి పరీక్షలు చేయించుకోవడం అన్ని విధాలా మంచిదని 42 వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యాన పిన్నింటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో తిరుమల మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత బిపి ,షుగర్, ఇసిజి పరీక్షలతో కూడిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

సమస్యలు పునరావృతం కానివ్వొద్దు

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-శృంగవరపుకోట


అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అధికారులను ఆదేశించారు. లక్కవరపుకోటలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చందులూరు ఎంపిటిసి యడ్ల కిశోర్ మాట్లాడుతూ గ్రామసభ రికార్డులను ట్యాంపరింగ్ చేశారని, పంచాయతీ కార్యదర్శి సచివాలయ మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, పారిశుధ్యం లోపించిందని పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపిపి స్పందిస్తూ కార్యదర్శిపై విచారణ చేసి నివేదికను అందించాలని ఎంపిడిఒ అప్పారావుకు సూచించారు. విశాఖ-అరకు రహదారిలో ఆర్‌టిసి బస్సులను ఆపడం లేదని సభ్యులు లేవనెత్తారు. డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్టాప్‌ల వద్ద ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎపిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ మండలానికి ఉపాధి పనులు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లు నాయుడు, వైస్ ఎంపిపి శ్యామల, ఎంపిడిఒ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-కంటోన్మెంట్, సంతకవిటి



సంతకవిటిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ నాగేంద్ర తదితరులు

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఇంటింటి సర్వే బృందాలు ఆశ కార్యకర్త, మేల్ వాలంటీర్ల ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే “లెప్రసీ కేస్ డిటెక్షన్ కాంపెయిన్’ ఈ నెల 17 నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతోందని అన్నారు. ప్రజలందరూ తప్పని సరిగా ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి తనిఖీలు చేయించుకోవాలని కోరారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టిబి అధికారి డాక్టర్ కె.రాణి మరియు వివిధ ఆరోగ్యశాఖ అదికారులు పాల్గొన్నారు..

కుష్టు నివారణలో కలిసి ముందడుగు

సంతకవిటి : మండలంలోని ఈ నెల 17 నుంచి 30 వరకు జాతీయ కుష్టు వ్యాధి నియంత్రణ గుర్తింపు ప్రచారం ప్రారంభమవుతుందని తహశీల్దార్ బి.సుదర్శన్ రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆశా వర్కర్లు, పురుష వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకవిటి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా సులభంగా నివారించవచ్చు నాన్నరు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ఎంఇఒ బి.శాంతి కుమారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరవ దివస్ వేడుకలు

ప్రజాశక్తి-గంట్యాడ

బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమాన్ని తాటిపూడిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిర్సా మండా వారి జీవితచరిత్ర , స్వతంత్ర ఉద్యమం సమయంలో బ్రిటిష్ వారి పై అతని పోరాటాల గురించి వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర వహించిన గిరిజన స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర, మల్లు దొర, పండు పడాల్ మొదలైనటువంటి వారి జీవిత చరిత్రలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వి.సంతోష్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గిరిజన విద్యార్థుల నృత్యాలు, గిరిజన స్వాతంత్ర ఉద్యమ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యరకమంలో హెచ్ ఎం. సత్యారావు, పలు శాఖల సిబ్బంది, గిరిజన సంఘం నాయకులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుని వేషధారణలో మాట్లాడుతున్న విద్యార్థి

పిజిఆర్ఎస్ వినతుల పరిశీలన

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలో శనివారం గర్భాం సచివాలయంలో గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన వినతులకు అధికారులు ఇచ్చిన సమాధానం నచ్చక అసంతృప్తి చెందిన దరఖాస్తులను శనివారం జిల్లా పంచాయతీరాజ్, మండల ప్రత్యేక అధికారి, డివి మల్లికార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 సమస్యలు పట్ల అసంతృప్తి వాదులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడేందుకు వచ్చామన్నారు. పోలీసు శాఖకు సంబంధించి బుధ రాయవలస గ్రామానికి చెందిన ఎలకల పెంటయ్య పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసి, ఫిర్యాదుకు న్యాయం జరగక అసంతృప్తితో ఉన్నారన్న విషయం నేరుగా ఆయన కుమారుడు ఎలకల శంకరరావుతో మాట్లాడి పరిశీలించామన్నారు. ఇదే గ్రామానికి చెందిన సరిది లక్ష్మంనాయుడుతో భూ సమస్య గూర్చి మాట్లాడామన్నారు. యాడిక గ్రామానికి చెందిన రెడ్డి బలరాం సాగు చేస్తున్న భూమి వన్‌బి మరొకరి పేరున నమోదైన విషయమై ఆయనతో మాట్లాడామని చెప్పారు. పిజిఆర్ఎస్ అసంతృప్తి ఫిర్యాదుదారుల దగ్గర నుండి తీసుకున్న వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.


సమస్యలు వింటున్న ప్రత్యేకాధికారి డివి మల్లికార్జునరావు

పుస్తక పఠన ప్రాముఖ్యత తెలుసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పుస్తక పఠన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గాజుల రేగ శాఖ గ్రంథాలయ అధికారి ఎం. లక్ష్మణరావు అన్నారు. శనివారం గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజున పుస్తక ప్రదర్శన, స్వతంత్ర్య గాధల పుస్తకాల ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన భావిభారత పౌరులుగా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో నారాయణ పబ్లిక్ స్కూల, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

శృంగవరపుకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దామోదర్, ఓటరు అక్షరాస్యతా వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, రవితేజ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక, చిత్రలేఖన ప్రదర్శనకు విశేష స్పందన

రేగిడి : స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాధికారి పెంట ఈశ్వరరావు ఆధ్వర్యంలో రెండవ రోజు శనివారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ పుస్తక ప్రదర్శనకు ఎంపిడిఒ జివిఆర్ఎస్‌పి శ్యామలకుమారి, ఎంఇఒ-2 బి.యరకయ్య ఉపాధ్యాయులు జి.రామ్‌కుమార్ హాజరయ్యారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పుస్తకం తోడుంటే అనంత జ్ఞానం మన సొంతం అంతటి విజ్ఞానాన్ని అందించే అక్షరాల చెట్టు మన గ్రంథాలయం అని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని తెలిపారు. పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



గాజులరేగ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రెండో రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -గజపతినగరం

నిరసన తెలుపుతున్న పంచాయతీకార్మికులు



గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. 75 రోజుల జీతాలు చెల్లించాలని సమ్మెకు దిగారు. ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి జనార్దనతో సిఐటియు నాయకులు, కార్మికులు శనివారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల డిమాండ్లపై నిర్దిష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెను కొనసాగించారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బి.కనకరాజు, అప్పలరాజు, గోవింద్, పి.కోటేశ్వరరావు, ఎస్.కృష్ణ, డి.భాస్కరరావు, ఈశ్వరరావు, మహంకాళి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కాకి పెట్టిన నిప్పు

నాలుగు ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి- గరివిడి

కార్తీక మాసం సందర్భంగా పెట్టిన దీపం నాలుగు ఇళ్లను బూడిద చేసిన సంఘటన మండలంలోని కోనూరులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామంలో ఒక కుటుంబం తమ ఇంటి డాబాపై దీపాలను వెలిగించింది. ఓ కాకి ఇందులో ఓ దీపాన్ని ఎత్తుకెళ్లి సమీపంలోని ఓ ఇంటిపై పడేసింది. ఆ ఇంటి పైకప్పు తాటాకులతో ఉండడం వల్ల నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేలోపే చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు మంటలు విస్తరించాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపుచేశారు. ఆలోపే నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఇందులో ఓ ఇల్లు కౌలు రైతు నంబూరి గోపిది కాగా ఆయన ఇటీవల పంటల పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు చేసి తెచ్చి ఇంటో పెట్టాడు. ఈ ప్రమాదంలో ఆ సొమ్ముతో పాటు ఇంట్లోని అర తులం బంగారం కూడా కాలి బూడిదైందని వాపోయాడు. తహశీల్దారు సిహెచ్ బంగార్రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి, సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి మామిడి అప్పలనాయుడు

ఉల్లాస్ 2 శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్య మనలో ఉండే అంతర్గత శక్తిని పెంపొందిస్తుందని ఎంపిపి మామిడి అప్పలనాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అక్షరాస్యత నిరక్షరాస్యత ,ఉల్లాస్ 2 శిక్షణ తరగతులను ఎంపిపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చిత్తశుద్ధిగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రతి వాలంటరీ అమలు చేయాలన్నారు వ్యక్తిగతంగా ఎదుగుదలకు ఉపయోగం ఉంటుందన్నారు విలువలతో కూడిన విద్యను అందిస్తే శక్తిగా ఎదగగలరన్నారు. ఎంఇఒ 2 సత్యవతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు సన్యాసమ్మ, మండల కోఆర్డినేటర్ జి. వేణు, మాస్టర్ ట్రైనర్ కె.రాము, మండల ఎఒ ఎస్ ,మోహన్ కుమార్,పలు గ్రామాల నుంచి శిక్షణకు విచ్చేసిన వాలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం దార్లపై బైండోవర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో పలు గ్రామాల్లో పట్టుబడ్డ 18మంది మద్యం అక్రమ విక్రయదార్లను పట్టుకొని 129 బిఎన్ఎస్ యాక్టు ప్రకారం మండల మేజిస్ట్రేట్ (తహశీల్దార్) వద్ద హాజరు పర్చి బైండోవర్ కేసులు పెట్టామని ఎక్సైజ్ సిఐ ఎం.వెంకట్రావు తెలిపారు. శనివారం వీరిని తహశీల్దార్ వద్ద హాజరు పర్చి ఒక సంవత్సరం కాలం వరకు బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ కాలంలో సత్ప్రవర్తనతో మెలుగు నిమిత్తం ఒక్కొక్కరి నుంచి రెండు లక్షల రూపాయలు విలువ గల బాండును పూచి కత్తుగా సమర్పించామన్నారు. బైండోవర్ కాల పరిధిలో మరలా నేరం చేస్తే రెండు లక్షల రూపాయలు అపరాద రుసుము కింద చెల్లించాల్సి ఉంటుందని, చెల్లించని యెడల చట్ట ప్రకారం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తహశీల్దారు కె.శ్రీకాంత్ ముద్దాయిలకు కౌన్సిలింగ్ ద్వారా హెచ్చరించారు.

అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. నిర్ణీత సమయానికి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది హాజరు పట్టిక ద్వారా తెలుసుకున్నారు. మెరుగైన పారిశుధ్య విధానానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్ చేరుకుని అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించారు

సమగ్ర కుల గణన చేయాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్థానిక సంస్థల ఎన్నికలకు బిసిల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకట రావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇదే అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు 'బిసి జనగణన- వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడమేనంటూ' హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారని తెలిపారు. అందులో భాగంగా హైకోర్టు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి,పంచాయతీరాజ్- పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులకు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు నోటీసులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల వాగ్దానం మేరకైనా బిసిలకు చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలన్నా, ముందుగా బిసి కులాల జనగణన జరిపించాలన్నారు. ఈ ప్రక్రియను 2026 ఏప్రిల్ కల్లా పూర్తి చేసి, చట్టబద్ధ బిసి రిజర్వేషన్లు అమలు జరపాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు వాళ్లే హరిబాబు, కార్యదర్శి అతవ సన్యాసిరావు పాల్గొన్నారు.

సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సంబంధించి బిసి, ఎసి, ఎస్టి నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఇ. అప్పన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థులు విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫోటోలు దరఖాస్తుకు జతచేసి నవంబర్ 25లోగా దరఖాస్తును జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆర్‌సిఎం స్కూల్స్, రూం నెంబర్ 8, పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు, పార్వతీపురం మన్యం జిల్లా వారికి సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8500187124, 9701786751, 9160801497 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

సంతకవిటిలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సంతకవిటి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ గోపాలరావు

వైనర్లు వాహనాలు నడపడం పట్ల కఠిన చర్యలు తప్పవని సంతకవిటి ఎస్ఐ ఆర్. గోపాల రావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో పోలీసులు పలు వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కూడా కఠినంగా వ్యవహరించనున్నట్టు ఎస్ఐ స్పష్టం చేశారు. అనంతరం వివిధ వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక హుండీకి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కోట జంక్షన్ వద్ద జిల్లా గ్రంథాలయ సేవా సంఘం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్వర్యంలో శనివారం పుస్తక హుండీ కార్యక్రమం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం వి ఎన్ వెంకట్రావు సహా పలువురు పాల్గొని పుస్తకాలను దానం చేశారు. సేకరించిన పుస్తకాలను డిగ్రీ కళాశాల లైబ్రరీ తో పాటు అవసరమున్న పలు గ్రంథాలయాలకు అందజేస్తామని గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జయపాల్ రావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గమ్యం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, మథర్ థెరెసా సంఘం ప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

413 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం

ప్రజాశక్తిక్తి - విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ దుకాణాలపై ప్రజారోగ్య అధికారులు దాడులు చేపట్టారు. 413కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సంబంధమూర్తి నగరంలోని చిన్న వీధి, గణేష్ ఆలయం వద్ద విక్రయిస్తున్న నిషేధిత ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు చేపట్టారు. ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సామాగ్రిని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కు తరలించారు. ఆయా దుకాణదారులకు రూ.25 వేలు అపరాధ రుసుము విధించారు.

మారికలో పాఠశాల నిర్మించాలి

ప్రజాశక్తి-వేపాడ



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

కరకవలస పంచాయతీ మారిక గ్రామంలో 27 మంది విద్యార్థులు రోజూ పాఠశాలకు వస్తున్నా, చదువుకునేందుకు భవనం లేకపోవడం అన్యాయమని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మారికలో పాఠశాల నిర్మాణం చేపట్టాలని కోరుతూ గిరిజనులతో జాకేరు సచివాలయం ముందు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాల నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా, ఒక్క ఇటుక కూడా వెయ్యకుండా రూ.8 లక్షలు డ్రా చేశారని చెప్పారు. బ్యాంకు నుంచి తీసిన నిధులు అప్పటి హెచ్ఎం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మండల విద్యాధికారులు కుమ్మక్కై తినేశారని తెలిపారు. ఇప్పుడు విద్యార్థులు చెట్టుకింద పాఠాలు వినాల్సి వస్తుందని, కలత చెందిన వారి తల్లిదండ్రులు శ్రమదానంతో పెంకులతో చిన్న షెడ్డు ఏర్పాటుచేశారని, అది ఏ గాలికో పడిపోతే పిల్లలు ప్రాణాలు పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే జిల్లా అధికారులు ప్రభుత్వ స్పందించి పాఠశాల భవనం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతబోయన పెంటమ్మ, బాబూరావు, అప్పలనాయుడు, వీర్రాజు, వెంకట్రావు, శ్రీను, బుజ్జి, ఆసు, దేవుడు, శోభనబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



చిట్టిబాబు దంపతులను సన్మానిస్తున్న ఖలీల్‌బాబు తదితరులు

ఇటీవల ఖతార్ రాజధాని దోహాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన అంతర్జాతీయ సామాజిక అభివృద్ధి సదస్సులో పాల్గొని పేదరికం, వివక్షత, ఆకలి చావులు వంటి అంశాలపై ప్రజెంటేషన్ ను అందించిన సామాజిక వేత్త, దళిత బహుజన శ్రామిక యూనియన్ ప్రతినిధి పెంకి చిట్టిబాబు దంపతులను ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ ధర్మకర్త డాక్టర్ ముహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ (ఖలీల్ బాబు) సత్కరించారు. ప్రజల అభ్యున్నతి కోసం శ్రమిస్తూ అంతర్జాతీయ స్థాయి సదస్సుల్లో సమ సమాజం కోసం తన వంతు సామాజిక కృషి చేస్తున్న చిట్టిబాబు లాంటి సామాజిక వేత్తలను సత్కరించడం ద్వారా వారిలో మరింత స్ఫూర్తిని కలిగిస్తుందని ఖలీల్ బాబు వ్యాఖ్యానించారు. చిట్టిబాబు ఎన్నో ప్రజా సమస్యలపైన సామాజిక శాస్త్రీయత ద్వారా అధ్యయనం చేస్తున్నారని కొనియాడారు. సీనియర్ జర్నలిస్ట్ ఎలిశెట్టి సురేష్, సిఐలు నరసింహ మూర్తి, వెంకట రమణ, ఎస్ఐ సత్యనారాయణతో పాటు, సోషల్ సర్వీస్ యూత్ అంబాసిడర్ ఎమ్‌డి అహమ్మద్ బాబు, చేయూత ఫౌండేషన్ ఫౌండర్ ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించిన అందెశ్రీ

ప్రజాశక్తి - పార్వతీపురం



అందెశ్రీకి నివాళ్లు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు, నాయకులు

తన రచనలు, పాటల ద్వారా సమాజంలో మానవతా విలువలు పెంపొందించిన గొప్ప కవి, రచయిత అందెశ్రీ అని ప్రజానాట్యమండలి నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ప్రజానాట్యమండలి కళాకారులు బోనెల పరశురాం ఆధ్వర్యాన ప్రజా కళాకారులు ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు పిల్ల లక్ష్మునాయుడు మాస్టారు, ఎం.తిరుపతిరావు, ప్రజానాట్యమండలి నాయకులు హిమరక రామారావు, పి.వరాలు, జె.రామయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు ముందుగా అందేశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సామాజికంగా దళితులు, గిరిజనులు, వృత్తిదారులు, పేదల సమస్యలపై అనేక పాటలు రాసి మానవతా విలువలను పెంచిన మహోన్నతమైన విలువలు కలిగిన కళాకారుడు డాక్టర్ అందెశ్రీ అని కొనియాడారు. ప్రకృతి కవిగా ప్రజల్లో గుర్తింపు పొందిన గొప్ప కళాకారుడు అందెశ్రీ అని అన్నారు 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు' అని లోకానికి మనిషి ఎలా ఉండాలనేది చెప్పిన గొప్ప మేధావి అని అన్నారు. జయజయ జయహే అని గీతం పాడి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు. అలాంటి కళాకారులు ప్రజా కళాకారులు ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కళాకారులని స్మరించుకున్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని అన్నారు. ప్రజా మన్ననలు పొందిన గొప్ప కవి అందెశ్రీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా పేదల గుండెల్లో నిలిచిపోతాడని అన్నారు. జోహార్ కామ్రేడ్ డాక్టర్ అంజశ్రీ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అనేకమంది కళాకారులు శ్రేయోభిలాషులు ప్రజానాట్యమండలి సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేస్తామని, అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు జడ్జి సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని జడ్జి తెలిపారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు.

లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందని ప్రతి కాక్షిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సిఐ, ఎస్ఐ,న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని దుగ్గేరులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తలపెట్టిన పంప్‌డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనుల తరఫున పోరాడేందుకు శనివారం ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. దుగ్గేరు సంత మార్కెట్ షెడ్ వద్ద సభ ఏర్పాటు చేశారు. గిరిజన నాయకులు రాయల సుందర్రావును కన్వీనర్‌గా, పిడిక అసిరి, ఊయక ముత్యాలు, మర్రి చెంచును కో కన్వీనర్లుగా, మొత్తం 32 మందితో దుగ్గేరు పంప్‌డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ గిరిజన గ్రామాలను ఖాళీ చేయిస్తూ, అటవీ భూములను దోచుకునేందుకు కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టే ఆలోచనలో ప్రభుత్వం తీసుకున్న పంపుడ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 84ను రద్దు చేయాలన డిమాండ్ చేశారు. 2 వేల మెగావాట్ల పంపుడు హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి దాదాపుగా వెయ్యి నుంచి 1500 ఎకరాల వరకు భూమి అవసరమని, దీని ద్వారా అనేక గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని అన్నారు. మన ప్రాంతంలోనే కాకుండా అల్లూరి సీతారామరాజు జిల్లా, కురుకుట్టి ప్రాంతాల్లోనూ ఇటువంటి పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జనాలు పోరాడుతున్నా రని, వీరిపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నా వెనక్కి తగ్గకుండా జీవన పోరాటం సాగిస్తున్నారని మనం కూడా అదే స్ఫూర్తితో ఐకమత్యంగా ఉండి పోరాడినప్పుడే ప్రభుత్వాలు వెనక్కి తగ్గుతాయని, మన ప్రాంతాన్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. ఈ సభకు దుగ్గేరు, మూలవలస, మెండంగి, కొంజుపాక, ఎర్రసా మంత వలస, ఎర్రమట్టివలస, ఊటగెడ్డ, బొడ్డుసామంత వలస, కె.పెద్దవలస, మార్కొండపుట్టి, సీబిల్లి, ఇటుకవలస, బెలగండ గ్రామాల నుంచి ముఖ్యులు పాల్గొన్నారు.

పిఎంఎవై సర్వేలో రహస్యమెందుకు?

సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - మక్కువ



గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

మండలంలోనితూరుమామిడిలో హౌసింగ్ అధికారులు శుక్రవారం చేసిన పిఎం ఆవాస్ యోజన సర్వే రహస్యంగా చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు తప్పుబట్టారు. మండలంలో ఇల్లు కట్టుకుంటామన్న ప్రతి లబ్ధిదారునికీ ఇంటింటా సర్వే చేయాలని, పిఎంఎవై సర్వేలో రహస్యమెందుకని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తూరుమామిడిలో లబ్ధిదారులతో కలిసి మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ అధికారులు చేసిన పిఎం ఆవాస్ యోజన సర్వే రహస్యంగా చేశారని, టిడిపి కార్యకర్తలు చెప్పిన వారికే సర్వే చేశారని, స్థానిక, టిడిపి కార్యకర్తలను పక్కను పెట్టుకొని సర్వే చేసి లబ్ధిదారులకు ఫోటోలు తీశారని తెలిపారు. మండల హౌసింగ్ అధికారులు టిడిపి పార్టీకి తాబేదార్లా? అధికారులా? అని మండిపడ్డారు. గతంలో కూడా జగనన్న కాలనీ, అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించకుండా స్థానిక సర్పంచ్‌కు రూ.6 లక్షలు బిల్లులు చేశారని, లోకాయుక్తలో కేసు ఉంటుండగా జగనన్న కాలనీ అభివృద్ధి పనుల్లో పలు అక్రమాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే మండలం సర్వసభ్య సమావేశంలో పిఎం ఆవాస్ యోజన పథకం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తామని చెప్పి రహస్యంగా వచ్చి సర్వే చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇందులో ఏ మతలబు వుందో చెప్పాలన్నారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకుంటాం సర్వే చేయండని అడిగితే టిడిపి కార్యకర్తలను అడగండని స్వయంగా హౌసింగ్ ఎఇ చెబుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క తూరుమామిడిలోనే టిడిపి కార్యకర్తలు చెప్పినట్లు సర్వే చేస్తున్నారా లేక మండలమంతా ఇలాగే సర్వే చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా హౌసింగ్ అధికారులు లబ్ధిదారులు అందరినీ పార్టీలకు అతీతంగా పిఎంఆవాస్ యోజన సర్వే చేసి, లబ్ధిదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. అలా కాకుంటే సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని, ప్రజలను కదిలించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇది ఎలా ఉండగా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో సర్వే చేపడతామని హౌసింగ్ ఎఇ సింహాచలం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హైమావతి

సమస్యలపై దృష్టిపెట్టాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గంట్యాడ

గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎంపిపి పీరుబండి హైమావతి.. అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్‌పై దృష్టిపెట్టాలన్నారు. ఎఎంసి చైర్మన్ గోపాలరాజు మాట్లాడుతూ సమస్యలను మంత్రి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఎఒ బి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబర్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పారు. కట్టెజనుము, పెసలు, మినుముల విత్తనాలను సబ్సిడీపై అందిస్తామన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి హేమలత మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ నానిబాబు మాట్లాడుతూ కొత్తవెలగాడ, గొడియాడ, బోనంగి గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు నిర్మించడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 19 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ ఆర్ఒ రమణమూర్తి, సిఎస్ డిటి మూర్తి, ఎపిఒ సుందరరావు, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అత్యున్నత గౌరవం

ప్యానెల్ చర్చా మండలి సభ్యుడిగా మనాలి నుంచి ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. ఈనెల 20,21 తేదీల్లో జిల్లా మనాలిలో జరగబోయే జియోస్పేషియల్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేలపై జరిగే ప్యానెల్ చర్చా మండలి సభ్యుడిగా ఆహ్వానం వచ్చింది. భూ పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ సెక్రటరీలకు నేషనల్ వర్కుషాప్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలన, సర్వే విభాగంలో జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి కనబర్చి, విశేష సేవలకు ఈ అరుదైన అవకాశం లభించింది. గతంలో రాష్ట్ర భూ పరిపాలన విభాగంలో జాయింట్ సెక్రటరీగా పని చేసిన అనుభవం ఉండడం, రెవెన్యూ, సర్వే, భూ రికార్డుల వంటి భూ పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై ఆయనకు ఉన్న విస్తృత అనుభవం, నైపుణ్యం దృష్ట్యా రెండు రోజుల జాతీయ సమావేశం వివరణాత్మక షెడ్యూల్ పొందుపరుస్తూ సలహాలు, సూచనలు ఇవ్వాలని డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సస్ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆహ్వానించింది.

17న పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పార్వతీపురం :జిల్లాలో ఈనెల 17న సాలూరు, భామినిలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఆర్ఆర్ ఏసురాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 పత్తి సీజన్లో కనీస మద్దతు ధర పొడుగు పింజ క్వింటాలు రూ.8110, పొట్టి పింజకు రూ.7710 చొప్పున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు పత్తిని ప్రభుత్వానికి అమ్ముకుని మద్దతు ధరలు పొందాల్సిందిగా కోరారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముకొనేందుకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి విఎఎలచే సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. రైతులు తమ మొబైల్ ఫోన్లో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని కూడా శ్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోన్ నెంబర్: 9676608792, పాలకొండ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోన్ నెంబర్ : 9182361374 ATUL P.WAGHMARE - సిసిఐ కొనుగోలుదారులు 9529417114 ఫోన్ నెంబర్లకు సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

105 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - భామిని



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

కేరళకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశా నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 105 కేజీల గంజాయిని బత్తిలి పోలీసులు శుక్రవారం పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై పాలకొండ డిఎస్‌పి రాంబాబు శనివారం విలేకరులకు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కేరళకు ప్రతాప్ సింగ్ ఫైసల్, నదీమ్ సునీల్ ఒడిశాలోని రాయగడ జిల్లా, మునిగూడ వద్ద ఫోన్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తి వద్ద 105 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. తమ రాష్ట్రంలో విక్రయించేందుకు కేరళ వెళ్లేందుకు భామిని మీదుగా శ్రీకాకుళం హైవేకి చేరుకోవచ్చు తెలపడంతో ఈ మార్గం ద్వారా కారులో గంజాయి తరలిస్తున్నారు. బత్తిలి అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద కారును తనిఖీ చేయడానికి ఆపినా కారు ఆపకుండా, ముందుకు వెళ్లడంతో అనుమానం వచ్చి కారును వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. కారులో డిక్కీలో అక్రమంగా రవాణా చేస్తున్న 52 ప్యాకెట్లు గంజాయి లభించింది. వీటి బరువు 105 కేజీలు కాగా, సుమారు రూ.2లక్షలు విలువ ఉంటుంది. కేసును దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమం ఎస్ఐ అప్పారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్

నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్లో కలపాలి

బిర్సా ముండా జయంతిలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ కోరారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. బిర్సా ముండా చిత్ర పటానికి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు ఎం లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో గిరిజన ఉద్యోగుల రాష్ట్ర నాయకులు ఎస్.భాస్కర రావు, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన 78 ఏళ్లు అవుతున్నా గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జిల్లాలో వందశాతం గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాన్ని 5వ షెడ్యూల్‌లో కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామస్వామి, అధ్యక్షులు లక్ష్మణ్, తిరుపతిరావు, రామారావు, లక్ష్మయ్య, శ్రీను, మహిళా సంఘం నాయకులు వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన

గుమ్మలక్ష్మీపురం : స్థానిక పోస్టుమెట్రిక్ బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు మాట్లాడుతూ నేటి యువత బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకొని గిరిజన ప్రాంతాల హక్కులు, చట్టాలు పరిరక్షించుకోవాలని గిరిజనులం తా ఐక్యంగా ఉండాలని జిఒ 3 ప్రత్యామ్నాయ పోరాటానికి గిరిజన యువత, విద్యార్థులు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.